క్లుప్తంగా

నున్నలో వైఎస్సార్ సీపీ ఇంటింటి ప్రచారం



నున్న(విజయవాడరూరల్): ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి సంక్షేమ పథకాల రథసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ నాయకులు నున్న గ్రామంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తూ ప్రజలకు వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై స్పందించే గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావులను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, సర్పంచి కాటూరి సరళ, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, మాజీ ఉప ఎంపీపీ జీతం శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచి భీమవరపు శివరామిరెడ్డి, దండు సుబ్రహ్మణ్యంరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆర్‌బీఐ నిబంధనలు తెలుసుకోవాలి



పెనమలూరు: ప్రతి ఒక్కరూ ఆర్‌బీఐ నిబంధనలు తెలుసుకోవాలని ఆర్‌బీఐ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు సూచించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం ఆర్బీఐ, ఆర్డిక్స్ సంస్థ ఆధ్వర్యాన డిపాజిటర్స్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంపై విద్యార్థులు అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. బ్యాంకు ఖాతా తెరవడం, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవడం, రుణాలు పొందడం, బ్యాంకు ఖాతాతో బీమా ప్రయోజనం, పథకాలపై సబ్సిడీ వివరాలు ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. కాలేజీ హెచ్‌ఓడీ డాక్టర్ బేబిరాణి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులకు బ్యాంకు రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత అధికారి ఆర్‌ఎస్.శంకర్‌రావు, ఆర్డిక్స్ సంస్థ ప్రతినిధి వై.సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం శ్రీ శారదా నృత్య కళాపీఠంకు చెందిన పలువురు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాట్యాచార్య సంతోష్ పర్యవేక్షణలో కళాపీఠానికి చెందిన వారు పలు అమ్మవారి కీర్తనలకు నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచ హారతుల అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను పెద్ద ఎత్తున భక్తులు హాజరై వీక్షించారు. అనంతరం నృత్య ప్రదర్శన ఇచ్చిన వారికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా సంగీత కళాశాల వార్షికోత్సవం

విజయవాడకల్చరల్: ఏపీ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల వార్షికోత్సవాన్ని కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగీతం అభ్యాసం చేసిన ఎందరో విద్యార్థులు ఉన్నతస్థితిలో ఉన్నారని చెప్పారు. భరతనాట్యం అధ్యాపకురాలు భాగవతుల సౌమ్య భరతనాట్య బృందం సంప్రదాయంలోనూ, అజయకుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. వయోలిన్ అధ్యాపకురాలు కృష్ణవేణి బృందం వయోలిన్‌పై పలు అంశాలను ప్రదర్శించారు. గాత్ర విభాగానికి సంబంధించి, లక్ష్మీ నరసమ్మ, మల్లాది కార్తీక త్రివేణి, శోభాలక్ష్మి బృందాలు శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుతూ పలు సంకీర్తనలు, దేశ భక్తి గీతాలు ఆలపించారు. వీణ అధ్యాపకురాలు మాధవి, మృదంగం అధ్యాపకులు ఫల్గుణ్, స్టీవెన్‌రాజు, తబలా అధ్యాపకుడు అమృతకుమార్ తన విద్యార్థుతో పలు అంశాలను ప్రదర్శించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత దండమూడి సుమతీ రామ్మోహనరావును నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్త బాలాంత్రపు ప్రసూన, గోళ్ల నారాయణరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అండ.. వైఎస్సార్ సీపీ జెండా

- మంత్రి జోగి రమేష్
- పలు గ్రామాల్లో మంత్రి విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- అడుగడుగునా అపూర్వ ఆదరణ



మంతెనలో మంత్రి జోగి రమేష్‌కు హారతులు పట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

కంకిపాడు: పేద వర్గాలకు అండ.. వైఎస్సార్ సీపీ జెండా అని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, పెనమలూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. మండలంలోని మారేడుమాక, మంతెన, వేల్పూరు గ్రామాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల మేనిఫెస్టోని ఇంటింటికీ తీసుకువెళ్లి ఎన్నికల ప్రచారం సాగించారు. 58 నెలల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఆయా కుటుంబాలకు జరిగిన సంక్షేమాన్ని వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో జరిగిన సభల్లో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేసిందన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా పాలనను గ్రామ స్థాయికి తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. అన్ని వర్గాలకూ సత్వరమే ప్రజా సేవలు సమర్థంగా అందేలా ప్రభుత్వం పనిచేసిందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను చేరువ చేసిందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాలను ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయించిందన్నారు. మౌలిక వసతుల కల్పనతో గ్రామాల్లో ప్రగతి చోటుచేసుకుందని వివరించారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయాన్ని చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

కూటమికి తగిన గుణపాఠం చెప్పాలి..

మాయమాటలతో, మోసపూరిత వాగ్దానాలతో కూటమి ప్రజల్లోకి వస్తోందని, ప్రజలు విశ్వసించవద్దని మంత్రి జోగి రమేష్ విజ్ఞప్తిచేశారు. ఎల్లో మీడియా అభూతకల్పనలతో గందరగోళం నెలకొంటుందన్నారు. కేవలం అధికారం కోసమే మాయదారి మాటలతో ప్రలోభాలకు గురిచేస్తున్నారని, మోసపోవద్దని సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సర్పంచ్‌లు సీహెచ్ ఆదర్శకుమార్, వీరంకి వెంకటరమణ, చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, ఎంపీటీసీ సభ్యుడు ఉప్పలూరి శాంతి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకటసుబ్బారావు, నాయకులు కలపాల వజ్రాలు, గుడ్డేటి రాజశేఖర్, శీలం శ్రీరాములు, చెన్నుబోయిన సుబ్బారావు, కొఠారి సాంబశివరావు, కోటయ్యబాబు, అయ్యన్నబాబు, సునీల్, బాకీ రాజు, లాం సురేష్, బండెల సుబ్బారావు, మరీదు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

- రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, ఎన్నికల పరిశీలకులతో కలిసి మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన సందర్భంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నిబంధనల మేరకు సహకరించాలన్నారు. మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి, పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ శాసనసభ స్థానాలకు సాధారణ పరిశీలకులుగా జాన్ కింగ్ స్లే ఉన్నారన్నారు. మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి ఎన్నికల వ్యయ పరిశీలకులుగా మనీష్‌కుమార్ చవడ, గన్నవరం, గుడివాడ, పామర్రు, పెనమలూరు శాసనసభ స్థానాలకు సాధారణ పరిశీలకులుగా నరహరిసింగ్ బంగర్, మచిలీపట్నం, అవనిగడ్డ, పామర్రు, పెనమలూరు శాసనసభ స్థానాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులుగా చవాన్ ప్రవీణ్ మోహన్‌దాస్ ఉన్నారన్నారు. గన్నవరం, గుడివాడ, పెడన శాసనసభ స్థానాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులుగా వికాష్ చంద్రకరోల్, మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి పోలీస్ పరిశీలకులుగా ప్రసాద్ ప్రలాద్ అక్కనోరు లను నియమించారన్నారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయం మూడు సార్లు తనిఖీ కోసం సమర్పించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్, కౌంటింగ్ ముగిశాక 25 నుంచి 30 రోజుల్లోపు అభ్యర్థుల ఎన్నికల వ్యయం సరిచూసేందుకు సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం పింఛన్ లబ్ధిదారులు 12,836 మంది ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వం రూ. 3,86,97,500 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పింఛన్ డీబీటీ పద్ధతిలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. వికలాంగులు, అనారోగ్యంతో మంచంపై కదల్లేని లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇస్తారన్నారు. బ్యాంకు ఖాతాలో సాంకేతిక కారణాలతో సొమ్ము జమకాని లబ్ధిదారులకు మూడోతేదీన సచివాలయ సిబ్బంది ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారులు పింఛన్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

విజయవాడరూరల్: వికలాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బుధవారం నుంచి ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయబడునని ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 17,430 మందికి పింఛన్లు మంజూరు కాగా వాటిలో 4,018 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ద్వారా నేరుగా అందజేస్తామని చెప్పారు. మిగిలిన లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరిగిందని పేర్కొన్నారు.

‘స్ఫూర్తి’లో వేసవి శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పుస్తకాలతో కుస్తీ పట్టి పరీక్షలు రాసి అలసిపోయిన విద్యార్థులకు ఆటవిడుపుగా ఉండేందుకు అలాగే వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని గుర్తించి మరింత పదును పెట్టిందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో వేసవి కాలం సందర్భంగా ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ‘స్ఫూర్తి’ క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, పెన్సిల్ షేడింగ్, పెన్ డ్రాయింగ్, కార్టూన్స్, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, కాలిగ్రఫీ, పేపర్ క్విల్లింగ్, క్లే మౌల్డింగ్, మండాల ఆర్ట్, మైక్రో ఆర్ట్, లీఫ్ ఆర్ట్, ఫొటోగ్రఫీ, ఫొటోషాప్, డిజిటల్ పెయింటింగ్‌ల్లో నామమాత్రపు ఫీజుతో శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్న వారు గాయత్రి నగర్, వాసిరెడ్డి శివరామకృష్ణయ్య వీధి, విజయవాడలో ఉన్న తమ సంస్థలో నేరుగా కానీ 98493 55339, 93908 47433 నంబర్లలో కానీ సంప్రదించాలని కోరారు.

పేదలకు అండగా సీఎం జగన్



యనమలకుదురులో ఎన్నికల ప్రచారం చేస్తున్న జోగి రాజీవ్

పెనమలూరు: గతంలో ఎవ్వరు చేయలేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అమలు చేసి అండగా నిలిచారని మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ అన్నారు. యనమలకుదురు 14వ డివిజన్‌లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ జగనన్న తిరిగి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తెలిపారు. చంద్రబాబు వస్తే అన్ని పథకాలు రద్దు చేస్తారని అన్నారు. ప్రజలు వాస్తవ పరిస్థితులు గమనించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను తిరిగి సీఎంను చేయాని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ బాజీబాబు, యార్లగడ్డ నాగబాబు, కోసూరి నరేష్‌కుమార్, యార్లగడ్డ వీరబాబు, కసిరెడ్డి, అనిల్‌రెడ్డి, దసమంతరావు, వరప్రసాద్, రూహుళ్ల, రహీం పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

- గోపవరపుగూడెంలో రూ. 53.9 లక్షలతో వాటర్ ట్యాంకు
- ప్రతి ఇంటికి పైప్‌లైన్



గోపవరపుగూడెంలో కొత్తగా నిర్మించిన తాగునీటి ట్యాంకు

గన్నవరం రూరల్: మండలంలోని గోపవరపుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ గ్రామస్తుల తాగునీటి అవసరాలను తీర్చనుంది. గ్రామీణ నీటి సరఫరా శాఖ జలజీవన్ మిషన్ ప్రోగ్రాం ద్వారా ప్రభుత్వం రూ. 53.9 లక్షలతో 40 వేల లీటర్ల తాగునీటి ట్యాంకును నిర్మించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎస్సీ కాలనీలో ఇప్పటి వరకూ తాగునీటి ట్యాంకు నిర్మాణం కాలేదు. ప్రభుత్వాలు మారినా స్థానికుల నీటి అవసరాలు తీర్చేందుకు ఏ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జలజీవన్ మిషన్ ద్వారా ట్యాంకు నిర్మాణంతో పాటు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రతి ఇంటికి పైప్‌లైన్ ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో గ్రామస్తులకు ఎంతో సౌకర్యం ఏర్పడింది.

పాతట్యాంకు ఒక్కటే దిక్కు..

గ్రామంలో 1,633 మంది జనాభా ఉన్నారు. వీరందరికి ఎన్నో దశాబ్దాల క్రితం నిర్మించిన ట్యాంకు ఒక్కటే ఇప్పటి వరకూ నీటిని సరఫరా చేస్తోంది. అయితే సాంకేతిక లోపం వస్తే గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడుతుంది. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో అధికారులు గ్రామ పంచాయతీ వినతి మేరకు కొత్తగా తాగునీటి ట్యాంకును నిర్మించారు. త్వరలో ప్రారంభించనున్న ఈ ట్యాంకుతో ఎస్సీ కాలనీలో తాగునీటి ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

తాగునీరు అందరికీ అందుతుంది



గ్రామస్తుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు కొత్తగా ఈ ట్యాంకు నిర్మించాం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎస్సీ కాలనీకి ప్రత్యేకంగా ట్యాంకు నిర్మాణం కాలేదు. పాతట్యాంకు నుంచి నీరు ఇచ్చేవారు. కొత్తట్యాంకు నిర్మాణంతో సరిపడా తాగునీరు అందరికీ అందుతుంది.

– నల్లూరు వెంకటేశ్వరరావు, సర్పంచ్ గోపవరపుగూడెం

సిద్ధార్థలో ఘనంగా శ్రీశ్రీ జయంతి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆధునిక భావజాలంతో కార్మికుల, కర్షకుల పక్షాన శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) నిలిచి ఎన్నో సాహిత్య రచనలు చేశారని విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ అన్నారు. సిద్ధార్థ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి వేడుకలు కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో మంగళవారం నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బుబిళ్ల కాదేదీ కవితకు అనర్హం అంటూ శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితను చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ అభ్యుదయ రచయిల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపకుడిగా ఆధునిక సాహిత్యాన్ని శ్రీశ్రీ ముందుకు నడిపారని కొనియాడారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ శ్రీశ్రీ చేసిన రచనలను నేటి తరం యువత చదవాలన్నారు. సిద్ధార్థ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్.శివకుమార్ మాట్లాడుతూ శ్రీశ్రీ జీవిత విశేషాలను తెలియజేశారు. తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.నీరజ, డాక్టర్ ఎంవీ.రమణమూర్తి, జీ.శేషారత్నంతోపాటుగా విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీశ్రీ రచనల్లోని ముఖ్యమైన వాటిని అధ్యాపకులు చెప్పి విద్యార్థులను ఉత్తేజపరిచారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్



కొయ్యగూరపాడులో మహిళా కార్యకర్తలతో వంశీమోహన్

ఉంగుటూరు: జనరంజక పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే సంక్షేమ పథకాలు మీ ఇంటికే వస్తాయని గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొయ్యగూరపాడు, ఆముదాలపల్లి, ఆత్కూరు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి, పూలవర్షం కురిపిస్తూ వంశీకి స్వాగతం పలికారు. జై జగన్, జై వంశీ అంటూ నినాదాలు చేస్తూ అడుగడుగున ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఆముదాలపల్లి నుంచి కొయ్యగూరపాడు వరకు సాగిన బైక్‌ర్యాలీలో వంశీ కూడా పార్టీ శ్రేణులతో కలిసి బైక్‌పై ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. కేవలం 58 నెలల్లో సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు అబద్ధపు వాగ్దానాలతో వస్తున్నారని, నమ్మి మోసపోవద్దని సూచించారు. జగనన్న చేయగలిగింది మాత్రమే మేనిఫెస్టోలో పెట్టారని అన్నారు. తప్పనిసరిగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేలా కృషి చేస్తారని అన్నారు. ఈ ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎం చేద్దామని పిలుపునిచ్చారు. గడిచిన ఐదేళ్లలో దేశానికే ఆదర్శమైన పాలన జగనన్న అందించారని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పనైనా చేశారా అని ప్రశ్నించారు. అధికారం కోసమే ఆచరణ సాధ్యంకాని హామీలను ఇస్తూ ప్రజల వద్దకు కూటమితో వస్తున్నారని వారి కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా తనను, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఆర్టీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, నాయకులు జాజుల కిశోర్, సాయిల కరుణాకర్, బాలస్వామి, ఆర్నేపల్లి సింహాచలం, భూతపాటి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారం



నియామక పత్రం అందజేస్తున్న షేక్ నాగుల్‌మీరా

పాతపాడు(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రజలకు మంచి పరిపాలన అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండోసారి అధికారాన్ని చేపట్టడం ఖాయమని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. పాతపాడు గ్రామ శివారు మీనాక్షి నగర్‌లో మంగళవారం ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. ముస్లింలు అందరూ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావులను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ముస్లింల రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు ప్లాన్ చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థులను ఓడించాలన్నారు. అనంతరం ఆజాద్ ముస్లిం కమిటీ ముస్లిం మైనార్టీలకు చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. షేక్ షబాషిని ఆజాద్ ముస్లిం కమిటీ మీనాక్షి నగర్ అధ్యక్షుడిగా నియమించి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం



నిడమానూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గోపవరపుగూడెంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బ్యాంకు ఛైర్‌పర్సన్ పాములు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు, ప్రసాదంపాడు, రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామవరప్పాడులో సర్పంచ్ వరి శ్రీదేవి, ప్రసాదంపాడులో ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, ఎనికేపాడులో సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, కోనేరు సుబ్బారావుల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. నిడమానూరులో సర్పంచ్ శీలం రంగారావు, వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు పరిమి సింధూర ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శీలం రంగారావు మాట్లాడుతూ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించేలా వైఎస్సార్ సీపీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో నిడమానూరు కన్వీనర్ పరిమి వంశీ, బొగ్గవరపు రాజేంద్రప్రసాద్, ప్రసాదంపాడులో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, యూత్ నాయకుడు పిన్నిబోయిన రవికుమార్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: ప్రజలందరికీ మేలు జరిగేందుకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని గోపవరపుగూడెం సహకార బ్యాంకు ఛైర్‌పర్సన్ కొలుసు పాములు కోరారు. మంగళవారం రాత్రి పార్టీ నాయకులతో కలిసి ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వి.హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించండి



రాయ్‌నగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గన్నవరం: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీకి ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌రావుకు మద్దతుగా స్థానిక రాయ్‌నగర్‌లో వార్డు సభ్యురాలు వింత జయగీత ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందజేసిందన్నారు. ముఖ్యంగా వంశీమోహన్ గత రెండు దశబ్దాలుగా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు చేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు వింత రవీంద్రరెడ్డి, బూసిరెడ్డి, బర్మా శ్రీను, బత్తుల ఆశారేఖ, వింత శివపార్వతి, పాలేటి రాజు, లూక్కా సతీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనం



కంకిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాక్షాత్తూ ఎన్నికల ప్రచారంలో తరలివస్తున్నట్లు ఉంది కదూ..! మండలంలోని గొడవర్రు గ్రామంలో సోమవారం రాత్రి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఎన్నికల ప్రచారం సాగింది. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు జగనన్న భారీ కటౌట్‌ను ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించారు. ప్రచార పర్వానికి ఈ కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.